క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం

నెల్లూరు సిటీ: తన ప్రేమ పెళ్లికి తల్లిదండ్రులు అంగీకరించలేదని ఓ యువకుడు ఉరేసుకుని బలన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని మూడో మైలులో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూడో మైలులో జమాల్‌బాషా నివాసం ఉంటున్నారు. ఆయన వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నారు. అతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిన్నకుమారుడైన ఎస్‌కే ఇబ్రహీం(22) రెండేళ్లుగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఈ విషయం ఇటీవల కుటుంబసభ్యులకు తెలియజేశాడు. తననే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. అయితే కుటుంబసభ్యులు అంగీకరించకపోవడంతో గురువారం ఇంట్లోని తన గదిలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శేష వాహనసేవ



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శేష వాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలను ఈఓ గిరికృష్ణ పర్యవేక్షించారు.

శేషేంద్రశర్మ సాహితీ సేవలు ఎనలేనివి



తోటపల్లిగూడూరు: గుంటూరు శేషేంద్రశర్మ సాహితీ సేవలు ఎనలేనివని పలువురు జిల్లా సాహితీ ప్రముఖులు పేర్కొన్నారు. ప్రముఖ కవి గుంటూరు శేషేంద్రశర్మ వర్ధంతిని ఆయన స్వగ్రామం తోటపల్లిగూడూరులో గురువారం నిర్వహించారు. శేషేంద్రశర్మ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సంస్కృతాంధ్ర భాషలతో పాటు కన్నడ, ఉర్దూ, బెంగాలీ, హిందీ, నేపాలీ, గ్రీకు భాషల్లో తన రచనలను అందించడం గుంటూరు శేషేంద్రశర్మ కవితాశక్తికి నిదర్శనమన్నారు. శేషేంద్రశర్మ అడుగుజాడల్లో నేటి తరం కవులు నడవాల్సిన అవసరం ఉందన్నారు. చిత్తూరు జిల్లా రచయితల సమాఖ్య సమన్వయకర్త పలమనేరు బాలాజీ, ప్రముఖ జ్యోతిష్యులు పాయసం సుబ్రహ్మణ్యం మహర్షి, కవి ఈతకోట సుబ్బారావు, పెరుగు రామకృష్ణ, గుండాల నరేంద్రబాబు, వల్లూరు మాధవరావు, వెంకటప్పయ్య, గుంటూరు సుబ్రహ్మణ్యం, శశిధర్, పలువురు సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం శ్రీవారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుదర్శన నారసింహమేష్టి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా మెంటా సుధీకర్‌కుమార్, డాక్టర్ వెంకటసాయి స్పందన, తన్నీరు వెంకటచలపతి సునీతలక్ష్మి దంపతులు వ్యవహరించారు. సాయంత్రం 7 గంటలకు హనుమంత సేవ, ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీవారు చంద్రప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఆలయ నిర్వాహక కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెంద్యాల రమణయ్య నాయుడు, వాకాటి శ్రీనివాసులురెడ్డి, గౌరవాధ్యక్షుడు కోనం చినబ్రహ్మయ్య, సభ్యులు ఎం శ్యాంప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, మురళి తదితరులు పర్యవేక్షించారు.

ప్రత్యేకావసరాల పిల్లల భవితకు భరోసా



వేదాయపాలెంలోని భవిత కేంద్రంలో క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

- మానసిక వికలాంగ పిల్లలకు అండగా భవిత కేంద్రాలు
- వారి గుర్తింపునకు ఇంటింటి సర్వే
- జూన్ 9 వరకు సర్వే చేపట్టనున్న ఐఈఆర్టీలు
- నెల్లూరు రూరల్‌లో కొత్తగా 13 మంది గుర్తింపు
- వేదాయపాలెంలోని భవిత కేంద్రంలో చేర్పించేందుకు చర్యలు

నెల్లూరు సిటీ: ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లల భవితకు భవిత కేంద్రాలు భరోసా కల్పిస్తున్నాయి. వారు సమాజంలో వేసే ప్రతి అడుగుకు మానసిక వైకల్యం అడ్డుగా కాకుండా..మనోస్థైర్యంతో ముందుకెళ్లేలా ప్రత్యేక శిక్షణను అందిస్తున్నాయి. తద్వారా వారి మానసిక, శారీరకంగా ఎదుగుదలకు తోడ్పాటును అందించడంతో పాటు విద్యను అందిస్తూ విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతున్నాయి. నెల్లూరు రూరల్ మండలంలోని ప్రత్యేకావసరాలు కలిగిన ఐదేళ్ల నుంచి 18 ఏళ్లలోపు పిల్లల కోసం ప్రభుత్వం 2023 జూన్ 4న వేదాయపాళెంలో భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. తొలి సంవత్సరంలో 17 మంది పిల్లలు చేరారు. ఈ ఏడాది పిల్లలను భవిత కేంద్రంలో చేర్పేందుకు నెల్లూరు రూరల్ ఎంఈఓ భిక్షాలు సూచనల మేరకు ఐఈఆర్టీలు కూర్మారావు, శిధర్ ఇంటింటి సర్వే చేపడుతున్నారు. అందులో భాగంగా ఇప్పటికే 13 మందిని గుర్తించారు. జూన్ 9వ తేదీ వరకు సర్వే కొనసాగించనున్నారు. ఇంటింటికి వెళ్లి దివ్యాంగ, ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలకు చదువు వల్ల కలిగే ప్రయోజనాలు, వారి సంక్షేమానికి అమలవుతున్న రాయితీలు, సదుపాయాలను తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. భవిత కేంద్రాల్లో పిల్లలకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణపై అవగాహన కల్పిస్తున్నారు.

జూన్ 9 వరకు సర్వే

నెల్లూరు రూరల్ మండలంలోని 18 పంచాయతీల్లో సర్వే చేసి ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలను గుర్తిస్తున్నాం. ఇప్పటి వరకు కొత్తగా 13 మందిని గుర్తించాం. గ్రామాల్లో పర్యటించి ప్రత్యేకావసరాల పిల్లల తల్లిదండ్రులకు భవిత కేంద్రాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యేకావసరాల పిల్లలకు విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం భవిత కేంద్రాలను నిర్వహిస్తోంది.

– భిక్షాలు, ఎంఈఓ, నెల్లూరు రూరల్



సర్వే చేస్తున్న ఐఈఆర్టీలు

ప్రయోజనాలు

- దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు అందజేత
- భవిత కేంద్రానికి వచ్చేందుకు ప్రతినెలా రూ.300 చొప్పున రవాణా చార్జీలు చెల్లిస్తారు
- వారి సహాయకులకు రూ.300 చొప్పున చెల్లిస్తారు
- వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా ట్యాబ్‌లు అందజేస్తారు.
- 9,10 తరగతుల విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం కింద ఏడాదికి రూ.9 నుంచి రూ.11వేల వరకు అందిస్తారు
- వైకల్యం అధికంగా ఉన్న వారికి సదరం ధ్రువీకరణ పత్రాలతో పింఛన్లు
- రైళ్లలో, బస్సుల్లో ప్రయాణానికి పాస్ సదుపాయం కల్పిస్తారు.
- భవిత కేంద్రంలో విద్యతో పాటు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీని అందిస్తారు.

పది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తోట ప్రభాకర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్ట్ అధ్యక్షుడు తోట ప్రభాకర్ తెలిపారు. నగరంలోని సుజాతమ్మకాలనీలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు కోసూరు గోవిందయ్యగౌడ్ ఆశయ సాధన మేరకు ఏటా పది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నామని తెలిపారు. అర్హత కలిగి పది విద్యార్థులు జూన్ 30లోగా ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 81424 42333 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ముత్యంగౌడ్, శ్రీనివాసులు, రామచంద్రయ్యగౌడ్, వెంకటసుబ్బయ్య, తాతా సుబ్బారావు, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, రంగన్న, మల్లిఖార్జున్, వంశీ తదితరులు, పాల్గొన్నా రు.

మార్షల్‌ఆర్ట్స్ ప్రదర్శనకు నంది,ఐకాన్ అవార్డులు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మెగా ఎంటర్‌ప్రైజెస్ ప్రజెంట్ ఫిలిం డైరెక్టర్ శిరీషారెడ్డి ఆధ్వర్యంలో ఐకాన్, నంది అవార్డుల ప్రదానోత్సవాన్ని హైదరాబాద్‌లోని బిర్లా మందిరం ఫంక్షన్ హాల్లో ఈ నెల 26న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్, సెల్ఫ్ డిఫెన్స్ కాన్సెప్ట్ విభాగంలో తనకు నంది, కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఐకాన్ అవార్డులను అందజేశారని స్పైట్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వేగూరు ఆది తెలిపారు. ఈ సందర్భంగా పొదలకూరురోడ్డులోని స్పైట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి హాజరై అభినందించారన్నారు. 25 కళా సంఘాల కన్వీనర్లు దొర్నాల హరిబాబు, అమీర్‌జాన్, భాస్కర్, హరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సాయిదర్బార్ వార్షిక వేడుకలు



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న మధుసాయి

నెల్లూరు(బృందావనం): పద్మావతినగర్‌లోని సాయి దర్బార్ అద్దాల మందిరంలో 19వ వార్షిక వేడుకలను శుక్ర, శనివారాల్లో వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి గురువారం తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను సాయిమాత నిత్యాన్నప్రసాదాలయం ద్వారకామాయిలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుసాయి మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయినామ సంకీర్తన నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి సాయినాథుడికి విశేషాభిషేకాలు, పూజలు, 7గంటలకు ఆంజనేయస్వామికి విశేషాభిషేకాలు, తమలపాకుల పూజ, 9 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. శ్రీవారి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు కల్యాణ తలంబ్రాలు, ముత్యాలు అందజేయనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయిభక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

రేపు హనుమజ్జయంతి వేడుకలు



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లుగుప్తా, మస్తాన్‌రావు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శనివారం హనుమజ్జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ మందిర కమిటీ అధ్యక్షుడు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను మందిర కమిటీ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 6.30గంటలకు సువర్చల సమేత ప్రసన్నాంజనేయస్వామికి పంచామృతాభిషేకం, 8.30 గంటలకు మన్యుసూక్త హోమం, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, 10 గంటలకు భక్తులతో సామూహికంగా ఆకుపూజ, సింధూరార్చన, సహస్రనామార్చన, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు వివరించారు. సాయంత్రం 6గంటలకు ఫలాలతో విశేష అర్చన, రాత్రి 7గంటలకు ఒంటె వాహనంపై నగరోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు ఈ సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షుడు ఏవీ సత్యం, కోశాధికారి తన్నీరుమస్తాన్ రావు, స్వామి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

- సుజాతమ్మకాలనీలోని శ్రీకృష్ణయోగ-అష్టలక్ష్మి మందిర ప్రాంగణంలోని కార్యసిద్ధి ఆంజనేయ స్వామి మందిరంలో హనుమజ్జయంతి ఉత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించనున్నట్లు అవధూత దత్తపీఠం–నెల్లూరు శాఖ మేనేజింగ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్ గురువారం తెలిపారు. ఉదయం 7గంటలకు ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, 9.30గంటలకు భక్తులచే సామూహికంగా 1,08,000 తమలపాకులతో అర్చన , 10.30 గంటలకు మన్యుసూక్త హోమం, రాత్రి 7గంటలకు పల్లకిసేవ నిర్వహించనున్నట్లు వివరించారు.

ఘనంగా కృష్ణ జయంతి వేడుకలు



కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కళాకారులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని నర్తకిసెంటర్‌లో కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రముఖ నటుడు సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత నటుడు కృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సినీ,టీవీ ఆర్టిస్టు శింగంశెట్టి మురళీమోహన్‌రావు మాట్లాడుతూ నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా కృష్ణ ఎన్నో నూతన పోకడలకు నాందిపలికి భారతీయ సినీరంగంలో తనకంటూ ఒక గుర్తింపును తెచ్చుకున్నారని కొనియాడారు. తెలుగు చిత్రపరిశ్రమ ఖ్యాతిని ఇనుమడింపజేసిన వారిలో కృష్ణ ఒకరు అని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, వివిధ సంస్థలకు చెందిన నిర్వాహకులు సత్యం, రాము, మహేష్, రఘురామిరెడ్డి, అబ్దుల్, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కౌంటింగ్‌కు విద్యుత్ ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న ఎస్‌ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎన్నికల కౌంటింగ్ జరిగే జూన్ 4వ తేదీన కౌంటింగ్ కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా కోసం ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ తెలిపారు. నగరంలోని విద్యుత్‌భవన్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద నిరంతరం విద్యుత్ అధికారులు విధులు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. 220 కేవీ అంబాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఈఈ పరంధామయ్య,గొలగమూడి సబ్‌స్టేషన్ వద్ద ఈఈ రాఘవేంద్రతో పాటు అసిస్టెంట్ ఇంజినీర్లను నియమించినట్లు వివరించారు. కనుపర్తిపాడు వద్ద జయకృష్ణారెడ్డితో పాటు రూరల్ ఈఈ భానూనాయక్, డీఈఈలు పవన్‌కుమార్, శివశంకరయ్య, ఏఈ రాజాబాబును నియమించినట్లు తెలిపారు. అలాగే మూడు జనరేటర్లను ఏర్పాటు చేసి ఈఈలు జగదీష్, అశోక్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ముత్తుకూరు జనరేటర్ వద్ద ఈఈలు శ్రీధర్, కృష్ణారెడ్డి, డీఈఈ రాంప్రసాద్ రెడ్డి, సర్వేపల్లి జనరేటర్ వద్ద డీఈఈలు సురేంద్రబాబు, ప్రభాకర్‌ను నియమించినట్లు తెలిపారు. వీరితో పాటు 51 మంది విద్యుత్ ఉద్యోగులు కౌంటింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించనున్నారని వివరించారు.





టూరిజం పార్కు కళావిహీనం

నగరంలోని బారాషహీద్ దర్గా ఆవరణలో ఉన్న ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని పార్కు కళావిహీనంగా తయారైంది. గతేడాది డిసెంబర్‌లో వచ్చిన తుపాన్ ప్రభావానికి పార్కులోని చెట్లు అడ్డదిడ్డంగా పడిపోయాయి. ఆ తరువాత పార్కు నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. గాలికి పడిపోయిన చెట్లను తొలగించి పార్కును వినియోగంలోకి తీసుకురావాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడంతో అది పాములకు నిలయంగా మారింది. దీంతో పార్క్‌కు వచ్చి సేదతీరే నగర ప్రజలు, పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పర్యాటక శాఖ అధికారులు స్పందించి పార్కును వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



